క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు : రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ఖాదరబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సూర్యదేవునికి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఈ రమణారెడ్డి, బద్వేలి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఏఈలు, లైన్‌మెన్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మైదుకూరు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె పంచాయతీ ముసల్నాయునిపల్లెలో అభయ ఆంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆలయ పరిసరాల్లో సిమెంటు బెంచీలను వేయించడం పట్ల సర్పంచ్ నాగేంద్రబాబును మాజీ ఎమ్మెల్యే అభినందించారు. కోలాటం, చెక్కభజన, ఆర్కెస్ట్రా భక్తులను అలరించాయి. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు.

రేపు బ్రహ్మంగారిమఠంలో బహిరంగ వేలం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం దేవస్థానం పరిధిలో గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ ఈశ్వర్‌చారి తెలిపారు. భక్తులు సమర్పించుకొనే తల వెంట్రుకలు, పోలేరమ్మదగ్గర టెంకాలయల అమ్మకం, పోలేరమ్మదగ్గర కొబ్బెర చిప్పలు సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణ, పాదరక్షలు బద్రపరచుట, దేవస్థానం పరిధిలో పుస్తకాల విక్రయం వంటివాటికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆశ్రమానికి నిత్యావసరాలు వితరణ

పోరుమామిళ్ల : సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద వృద్ధాశ్రమానికి మంగళవారం పోరుమామిళ్లకు చెందిన వైష్ణవి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బట్టలు, పండ్లు, కూరగాయలు అందించారు. ఆశ్రమంలోని అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. వైష్ణవి పాఠశాల ఉపాధ్యాయులు వివేకానంద వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డికి ఆర్థిక సాయం చేశారు. వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వైష్ణవి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ అందించిన సహాయానికి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

50 బెంచీలు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక మోడంపల్లెలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌కు గాంధీరోడ్డులోని ఐడీబీఐ బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌లో భాగంగా మంగళవారం 50 ఐరన్ బెంచీలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షిస్తూ బెంచీలను బహుకరించిన ఐడీబీఐ బ్యాంకు అధికారులను అభినందించారు. డిప్యూటీ ఈఓ యు.మీనాక్షి మాట్లాడుతూ బ్యాంకు వారు రూ.1.50 లక్షల విలువైన 50 బెంచీలు ఇచ్చారని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఐడీబీఐ బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.మృదుల, ఐడీబీఐ ప్రొద్దుటూరు బ్యాంక్ మేనేజర్ కె.మధుసూదన్‌రెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమాంహుస్సేన్, టౌన్ బ్యాంకు సీఈఓ నిరంజన్‌రెడ్డి, చైర్మన్ బీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

దువ్వూరు(చాపాడు) : జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కాకినాడలోని జేఎన్‌టీయూ లోని ఇండోర్‌స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీల్లో దువ్వూరులోని శ్రీ షిరిడి సాయి స్కూల్ విద్యార్థులు 7 పతకాలు సాధించినట్లు తైక్వాండో కోచ్ సుధీర్‌కుమార్ తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో హరితశ్రీ (రజత), సంజీవలహరి(కాంస్యం), క్యాడెట్ బాలికల విభాగంలో వీర కార్తిక్(కాంస్యం), సబ్ జూనియర్ బాలుర విభాగంలో నాగ శ్రీచరణ్(కాంస్యం), క్యాడెట్ బాలుర విభాగంలో సాయి గిరీష్(కాంస్యం), హేమంత్‌కుమార్(కాంస్యం), శివగోవర్ధన్(కాంస్యం), నవీన్, విజయ్‌కుమార్‌లు ఐదో స్థానంలో నిలిచారు. తమ స్కూల్ విద్యార్థులు సాధించిన ప్రతిభ పట్ల కరస్పాండెంటు లోకేష్, హెచ్‌ఎం మస్తాన్, సిబ్బంది మంగళవారం అభినందించారు.

ఈకేవైసీ చేసుకోవాలి

చాపాడు : మండలంలోని చాపాడు, వెదురూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మ్యాగీ మాట్లాడుతూ.. రబీలో సీజన్‌లో సాగైన పంటలకు సంబంధిత రైతుల ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. ఈ నెల 25 లోగా ఆన్‌లైన్‌లోగా చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని కావాల్సిన రైతులు తీసుకెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు


రథోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి


పోరుమామిళ్ల: సూర్యప్రభ వాహనంలో వేంకటేశ్వరుడు


బద్వేలు అర్బన్: సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పలు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. పాత మార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం చెన్నకేశవ స్వామి, మహాలక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలను చేసి శోభాయమానంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా రూపొందించిన అశ్వ వాహనంపై కొలువుదీర్చారు. సాయంత్రం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సూర్య నారాయణస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రథ సప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనాలలో స్వామి వారు ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు చాటకొండు సుబ్రమణ్యం(రత్న), కార్యదర్శి జనార్దనశెట్టి, కోశాధికారి వెంకటేశ్వర్లు ఆలయ అర్చకులు కిషోర్‌శర్మ పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ఆలయాలలో మంగళవారం రథ సప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన వాహన సేవలలో భక్తులు పాల్గొన్నారు. కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అలాగే లక్ష్మీపాళెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. ఫైర్ స్టేషన్ వెనుక భాగంలోని మహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాలలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీతోపాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాధవరాయ స్వామి శమీ దర్శనం


శమీ దర్శనానికి వెళుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామి

మైదుకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో మంగళవారం శమీ దర్శనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పార్వేట నుంచి తిరిగి ఆలయానికి చేరుకున్న మాధవరాయ స్వామికి సోమవారం కల్యాణం గ్రామోత్సవాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామిని మేళతాళాలు, కోలాటంతో ఊరేగింపుగా స్థానిక సుందరాచార్యుల రోడ్డులోని శమీ వృక్షం వద్దకు తీసుకెళ్లారు. శమీ దర్శనం చక్రస్నానం చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండి బెల్లం సుబ్బరాయుడు, మాజీ చైర్మన్ సింగయ్యగారి రామమోహన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది పాత్రపై విచారణ జరపాలి


ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

బద్వేలు అర్బన్ : సర్వే నెంబర్ 967లోని 60 సెంట్ల రస్తా స్థలం ఆక్రమణలో రెవెన్యూ సిబ్బంది పాత్రపై విచారణ జరపడంతోపాటు అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి సంబంధిత ఆక్రమిత నిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, రస్తాల కబ్జాలను సహించేది లేదని, ఎంతటివారిపైన అయినా చర్యలు తీసుకుంటామని ప్రగల్బాలు పలుకుతున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు 967 సర్వేనెంబరులోని రస్తా స్థలంలో జరిగిన ఆక్రమణలు కనపడలేదా అని ప్రశ్నించారు. ఈ రస్తా స్థలం కబ్జా వ్యవహారంలో కొందరు గోపవరం రెవెన్యూ కార్యాలయంలోని అధికారుల పాత్ర ఉందని, దీనిపై జిల్లా స్థాయి అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, ఏరియా నాయకులు రామరాజు, అనిల్, సంజీవ్, చెన్నయ్య, చంద్రపాల్, లూకయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు మొహియుద్దీన్


మగ్దూం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

అట్లూరు : స్వాతంత్య్ర సమరయోధుడుగా, కార్మిక ఉద్యమ నాయకుడిగా, శాసనమండలి సభ్యుడిగా మగ్దూం మొహియుద్దీన్ చేసిన సేవలు ఎనలేనివని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.రమణారెడ్డి అన్నారు. మగ్దూం మొహియుద్దీన్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ 1947 జూన్ 9న ఎస్టీయూ ఆవిర్భవించడానికి మగ్దూం ప్రధాన కారకుడన్నారు. ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు ఎదురు తిరిగి పోరాటాలు సాగించిన యోధుడన్నారు. తన పదునైన తూటాల్లాంటి మాటలతో బ్రిటీష్ పాలకులను హడలెత్తించాడన్నారు. ఆయన విద్యారంగానికి, శాసనమండలిలో ప్రజాసమస్యలకు న్యాయం చేశాడన్నారు. ఆయన కృషి ఫలితంగా నేడు కార్మికులు, ఉద్యోగులు ఫలితాలు పొందుతున్నారన్నారు.

9న మండల సమావేశం

బి.కోడూరు : ఈ నెల 9వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ కోడూరు చెన్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వ్యర్థాల తొలగింపు

ప్రొద్దుటూరు : స్థానిక బాలాజీనగర్–1లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పర్యటించారు. మురికి నీరు కాలువ నుంచి బయటికి వస్తుండటంతో సమస్యను ప్రజలు కమిషనర్‌కు తెలిపారు. ట్రావెల్స్ వద్ద ఉన్న కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎస్.దస్తగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ఫీజుల దందా అరికట్టాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఫీజుల దందాను అరికట్టాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు బోర్డు పరీక్షలకు ముందు నిర్వహించే ప్రాక్టికల్స్‌ను క్యాష్ చేసుకునేందుకు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ప్రాక్టికల్స్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.1000 నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

ప్రొద్దుటూరు డీఎస్పీ భావన



మాట్లాడుతున్న ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారంగా మారుతుందని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. మండల పరిధిలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దన్నారు. ప్రతి విద్యార్థి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉండాలని తల్లిదండ్రులు కలలు కంటారని, అయితే కొందరు యువకులు గంజాయి తదితర మత్తు పదార్థాల బారిన పడి తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తున్నారని డీఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో డీఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రవాణా, పోలీసు అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : వాహనదారులకు పోలీసులు, రవాణాశాఖ అధికారులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రగుంట్ల రోడ్డులోని సర్కిల్ వద్ద మంగళవారం అధికారులు, సిబ్బంది బ్యానర్లు పట్టుకొని రోడ్డు పక్కన నిల్చున్నారు. వాహనాల్లో వెళ్లే వారిని ఆపి రహదారి భద్రత, నియమాలపై అవగాహన కల్పించారు. వాహన రికార్డులను పరిశీలించారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్తే జరిమానా విధిస్తామని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ట్రాఫిక్ సీఐ దేవకిరణ్‌కుమార్, ఎస్ఐ భాస్కర్, ఎంవీఐలు నారాయణనాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాస నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : అవగాహన, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. టీబీరోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా పట్టణంలోని లేపాక్షి డిగ్రీ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలి, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. వీడియో ద్వారా క్యాన్సర్ లక్షణాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం వల్ల క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని చెప్పారు. ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు సహకరించి వారు అడిగిన సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, సీఓ యంవీ సుబ్బారెడ్డి, కళాశాల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

■ శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యులు పద్మిని, మోహన్‌కాంత్, డీపీఎంఓ శివశంకరయ్య, మురళీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ క్యాన్సర్ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐడా ప్రెసిడెంట్ డాక్టర్ యోగానందరెడ్డి , ఐడా ట్రెజరర్ డాక్టర్ రామకృష్ణ, దంతవైద్యులు తేజ, లక్ష్మీకిశోర్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌యాదవ్, అమ్రిన్, మానస, శ్వేత, దీపిక పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం

ప్రొద్దుటూరు రూరల్ : క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కామనూరులో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ కృష్ణమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళీధర్, సూపర్‌వైజర్ చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ, లయన్స్‌క్లబ్ నుంచి లయన్ జీఆర్ చంద్రప్రకాష్‌రావు, సెక్రటరి అశోక్‌కుమార్, సుబ్రమణ్యం, ఎన్ సత్యనారాయణ, చంద్రమోహన్‌రావు, డాక్టర్ రాఘవేంద్రగుప్త, చెన్నైలోని క్యాన్సర్ సెంటర్ నుంచి అంకాలజిస్టు డాక్టర్ సీవీ రేవంత్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో..

చాపాడు: స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొద్దుటూరుకు చెందిన వైద్యులు డా.ఎస్.నజ్మ, డి.సుజనరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి, ముందు జాగ్రత్తలు, నివారణ ఉపాయాలు గురించి వివరించారు. స్త్రీలు ఎదుర్కొనే వివిధ రకాల గర్భాశయ క్యాన్సర్ వ్యాధుల గురించి విద్యార్థుల వివరించారు. అనంతరం వైద్యులను సీబీఐటీ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.శృతి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ఖాజీపేట : కేన్సర్ రహిత సమాజం కోసం కృషిచేద్దాం అని ఖాజీపేట ఆరోగ్య వైద్యాధికారి ఆయిషా సుల్తానా అన్నారు. ఆశాడే తోపాటు ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోగులు, వైద్య సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కేన్సర్‌ను అతి త్వరగా గుర్తించవచ్చునన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఆరోగ్యకరమైన పోషక పదార్థలతో కూడిన ఆహారం తీసుకుంటే కేన్సర్‌ను పూర్తిగా తగ్గించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆశా నోడల్ అధికారి అరుణకుమారి తోపాటు స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంపై ర్యాలీ

బి.కోడూరు : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, ముందస్తు క్యాన్సర్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. అలాగే ఆశాడేలో భాగంగా గర్భిణులు, బాలింతలకు కిల్‌కారీ సేవలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భవతి అయిన 4వ నెల నుండి బిడ్డకు సంవత్సరం వరకు ఈ కిల్‌కారీ సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : క్యాన్సర్‌పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సురేంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వై.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్, కోటవీధి అర్బన్ హెల్త్‌సెంటర్లు, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం వలన క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దు

పోరుమామిళ్ల : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా మంగళవారం టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి సమావేశం జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరీ ఎల్సా మాట్లాడుతూ క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. భారతదేశంలో క్యాన్సర్ ఎక్కువగా వ్యాప్తి చెందుతోందన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రజలకు క్యాన్సర్ లక్షణాలు, వ్యాప్తి చెందడం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆహార నియమాలు సక్రమంగా పాటించకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం తదితర కారణాల వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. సరైన సమయంలో పరీక్షలు చేయించి, చికిత్స పొందితే నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిర్మల, ఆరోగ్య విద్యాధికారులు వెంకటేశ్వర్లు, రఘురామ్, సరస్వతి పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ గుర్తింపు

మైదుకూరు : ముందస్తు పరీక్షలతో కేన్సర్‌ను గుర్తించి చికిత్స పొందవచ్చు అని మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలలిత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రంపచ కేన్సర్ అవగాహన దిన్సోతవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలలిత మాట్లాడుతూ కేన్సర్ ముందస్తుగా గుర్తించినట్లైతే క్యాన్సర్ నుండి పూర్తిగా బయటపడవచ్చని తెలిపారు. తగిన పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఎంవీ ప్రసాద్, అడోలిసెంట్ కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

దువ్వూరు : కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్ బాబు, రోషిణి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తు పరీక్షల ద్వారా గుర్తించి సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, శాంతకుమారి, సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సీబీఐటీలో వైద్యులను సన్మానిస్తున్న సీబీఐటి ప్రిన్సిపాల్, అధ్యాపకులు


బి.కోడూరులో.. క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


బద్వేలు అర్బన్: అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది


పోరుమామిళ్ల: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది